ప్రజాశక్తి
సోమవారం 10 జూన్ 2024
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



అయోమయంలో.. ఉపాధ్యాయులు

◆ రిలీవ్ కాలేక, డబ్బులు రాబట్టుకోలేక అవస్థలు
◆ అక్రమ బదిలీలకు రూ.5 లక్షల ఖర్చు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

పాఠశాలల పున:ప్రారంభం వేళ కొత్త పాఠశాలలకు వెళ్దామనుకున్న ఉపాధ్యాయులకు ఆ ఆశ లేకపోగా, బదిలీ కోసం చేసిన ఖర్చు తిరిగి చేతికివచ్చేలాలేదు. నిబంధనలను పక్కనబెట్టి గత ప్రభుత్వం ఇచ్చిన ఉపాధ్యాయుల బదిలీ ఉత్తర్వులను ప్రభుత్వం నిలిపివేయడంతో ఉపాధ్యాయులకు ఈ సమస్య ఎదురైంది. సార్వత్రిక ఎన్నికల ముందు బదిలీ ఉత్తర్వులు జారీచేసి, ఎన్నికల కోడ్ ముగిశాక రిలీవ్ చేయాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ జారీ చేసిన ఉత్తర్వులతో బదిలీ అయిన ఉపాధ్యాయులు సంబరపడ్డారు. ప్రభుత్వం మారడంతో అక్రమ బదిలీలను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఎన్నికల కోడ్‌కు ముందు 25 మంది ఉపాధ్యాయులను బదిలీచేశారు. కావాల్సిన చోటకు వెళ్లిపోవాలని ఉపాధ్యాయులు మూడు నుంచి ఐదు లక్షల రూపాయల వరకు ముట్టజెప్పారు. ఈ వ్యవహారంలో విద్యాశాఖ మంత్రి మొదలుకొని వివిధ స్థాయిగల విద్యాశాఖాధికారుల వరకు పాత్రవుందని ఆరోపణలున్నాయి. విద్యాశాఖ మంత్రి పాత్ర లేకుండా నిబంధనలకు విరుద్ధంగా బదిలీలకు అవకాశం వుండదని ఉపాధ్యాయ సంఘ నాయకులు చెబుతున్నారు. సాధారణ బదిలీలతో సంబంధం లేకుండా తమకు కావాల్సిన వారిని నచ్చిన చోటకు బదిలీచేసే దుస్సాంప్రదాయం ఎంతో కాలంగా సాగుతోంది. అక్రమ బదిలీపై వచ్చిన వారిపైనా, అందుకు సహకరించిన, తోడ్పడిన వారిపైనా ఎటువంటి చర్యలూ లేకపోవడంతో ఇదొక ఒరవడిగా మారింది. నగరంలోకి బదిలీపై రావడానికి అర్హతలేక పోయినా విద్యాశాఖ ఉన్నతాధికారులను పట్టుకొని తనకు కావాల్సిన ఉపాధ్యాయులను నగర పరిధిలోని పాఠశాలలకు తీసుకొచ్చిన పెద్దలు లేకపోలేదు. పలుకుబడి కలిగిన, పదవుల్లో వున్న వారికి కొంతమంది ఉపాధ్యాయులు డబ్బులు ఇచ్చి గ్రామీణ ప్రాంతం నుంచి నేరుగా నగరం నడిబొడ్డు పాఠశాలలకు బదిలీ చేయించుకున్నారు. అక్రమ బదిలీలకు మిగతా 2లో..



జైదీప్



సాయి నారాయణ



మారుతి కుమార్



హరీష్ కుమార్

జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో సత్తా

శశి, ఎసెంట్ విద్యార్థులకు ర్యాంకుల పంట

ప్రజాశక్తి - తగరపువలస : ఆదివారం విడుదలైన జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షా ఫలితాల్లో శశి విద్యాసంస్థల విద్యార్థులు సత్తా చాటారు. జి.జైదీప్ ఆలిండియా 223వ ర్యాంకు, కె.మనో కౌశిక్ 552వ ర్యాంకు, సిహెచ్.శ్యామ్ సుందర్ 601వ ర్యాంకు, ఎస్‌డివి.సతీష్ 644వ ర్యాంకు, సిహెచ్‌విఎన్.సాయి నారాయణ 1000వ ర్యాంకు, ఎస్.సోమ సాయి రాకేష్ 1286వ ర్యాంకు, జి.పృధ్వీతేజ 1423వ ర్యాంకు, కె.సాగర్ 1494వ ర్యాంకు సాధించినట్లు స్థానిక సంగివలస శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, అకడమిక్ డైరెక్టర్ మేకా క్రాంతి సుధ తెలిపారు. ర్యాంకర్లను అభినందించారు.



ఎంవిపి.కాలనీ : జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో మరోసారి ఎసెంట్ విద్యా సంస్థ మెరిసింది. మామిడి వెంకట కనక మారుతి కుమార్ ఆల్ ఇండియా 26వ ర్యాంకు (ఆర్‌సి), 56వ ర్యాంకు (సిఆర్ఎల్ - పిడబ్ల్యుడి), డొంక హరీష్ కుమార్ అల్ ఇండియా 402వ ర్యాంకు (ఆర్‌సి) సాధించారు. ఇవేగాకుండా 427, 547, 769, 814 ర్యాంక్‌లను విద్యార్థులు సాధించారు. 5000లోపు 38 ర్యాంకులను ఈ విద్యాసంస్థకు చెందిన వారు సాధించారు. వారిని సంస్థ అకడమిక్ డైరెక్టర్ జి.నాగేశ్వరరావు అభినందించారు.

మాకు అన్యాయం చేస్తారా..?

▶ వార్త 2లో..

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలి

▶ వార్త 2లో..

పల్లెల్లో కోతుల స్వైర విహారం

▶ వార్త 8లో..



ఉత్సవాల్లో ఆకట్టుకున్న కళారూపాలు

వైభవంగా మోదకొండమ్మ ఉత్సవాలు

పాడేరుకు వేలాదిగా తరలొచ్చిన భక్తులు

వార్త 8లో..

ఇందిరా స్టేడియానికి మహర్దశ

◆ రూ.2 కోట్లతో పునర్నిర్మాణం
◆ తుది దశకు చేరిన అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గంలోని పాత బస్‌స్టాండ్‌కు ఆనుకొని ఉండే ఇందిరా ప్రియదర్శిని నగర పాలక సంస్థ స్టేడియానికి మహర్దశ పట్టింది. రూ.2 కోట్లతో స్టేడియం పునర్నిర్మాణంతోపాటు కొత్త హంగులతో మరిన్ని నిర్మాణ పనులు చేపట్టారు. ఈసరికే కొన్ని పనులు పూర్తయ్యాయి. దాదాపు మూడున్నర దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ స్టేడియం నిర్వహణ లోపం వల్ల, అధికారుల, ప్రజాప్రతినిధుల అశ్రద్ధ వల్ల పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఒకప్పుడు జాతీయ స్థాయిలో క్రికెట్ పోటీలతో పాటు వరల్డ్ కప్ పోటీలు కూడా ఈ స్టేడియంలో జరిగాయి. అంతటి ప్రాధాన్యత ఉండే స్టేడియం దాదాపు 15 ఏళ్ల నుంచి నిరుపయోగంగా మారింది. స్టేడియంలో గ్యాలరీ, పెవిలియన్ భవనాలు, క్రీడాకారులు కోసం నిర్మించిన డ్రెస్సింగ్ రూమ్స్ పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. స్టేడియానికి మంచినీటి సౌకర్యం కల్పించే పైపులైన్లు, మోటార్లతో సహా దొంగల పాలయ్యాయి. విద్యుత్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది. కొన్నాళ్లపాటు ఇది డంపింగ్ యార్డుగా మిగతా 2లో..



గ్యాలరీకి రంగులు వేస్తున్న కార్మికులు

మొదటి పేజీ తరువాయి..

అయోమయంలో ఉపాధ్యాయులు

ఒక్కోసారి ఒక్కో ప్రభుత్వం అవకాశం ఇవ్వడంతో ఏ పలుకుబడీ లేని ఉపాధ్యాయులు నష్టపోతున్నారు. ఎన్నికల కోడ్‌కు ముందు బదిలీ అయిన ఉపాధ్యాయులు 25 మందిలో ఎస్‌జిటిలు 18 మంది, వివిధ సబ్జెక్టులు బోధించే స్కూల్ అసిస్టెంట్లు ఆరుగురు, ఒక పీడీ వున్నారు. వీరిలో ఎక్కువ మంది ఏజెన్సీలో పనిచేస్తున్నారు. జికె.వీధి, పెదబయలు, చింతపల్లి, డుంబ్రిగుడ, అనంతగిరి మండలాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అక్కడ నుంచి మైదాన ప్రాంతాల్లోని రావికమతం, నర్సీపట్నం, బుచ్చెయ్యపేట, భీమిలి, చినగదిలి, పెందుర్తి, నక్కపల్లి, గాజువాక మండలాలకు బదిలీ చేసుకున్నారు. ఈ మండలాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కొందరు తమకు కావాల్సిన మండలాలకు బదిలీ చేసుకున్నారు. అయితే ప్రభుత్వం మారడంతో ఈ అక్రమ బదిలీలను నిలిపివేయడంతో బదిలీ అయిన ఉపాధ్యాయులు రిలీవ్‌కాలేక, ఇచ్చిన డబ్బులు తిరిగి రాబట్టుకోలేక సుడుమడతలు పడుతున్నారు.



స్టేడియం వెలుపల నిర్మించిన తారు రోడ్డు

ఇందిరా స్టేడియానికి మహర్దశ

మారిపోయింది. అదే సందర్భంలో చుట్టుపక్కల ఉన్న కొందరు స్టేడియాన్ని పూర్తిస్థాయిలో దుర్వినియోగం చేశారు. జూదం, తాగుడు వంటి అసాంఘిక కార్యకలాపాలకు ఉపయోగించారు. దీనిని బట్టి స్టేడియం దుస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇదిలా ఉండగా దాదాపు ఐదేళ్ల క్రితం ఇందులో పోలీసు శిక్షణ కేంద్రాన్ని నిర్వహించారు. ఆర్మీ రిక్రూట్‌మెంట్ కోసం కూడా దీనిని వినియోగించారు. అనంతరం సిఆర్‌పిఎఫ్ దళాలు ఇక్కడ ఉండేలా ఏర్పాటు చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థకు చెందిన స్థలాన్ని స్వాధీనం చేసుకొని, దానిని ఆనుకొని ఉన్న సింహాచలం దేవస్థానానికి చెందిన ప్రహ్లాద కళ్యాణ మండపానికి సిఆర్‌పిఎఫ్ దళాలను ద్రోణంరాజు శ్రీనివాసరావు ఎమ్మెల్యేగా ఉండగా స్టేడియం నుంచి అక్కడికి పంపారు. అనంతరం స్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయాన్ని ఒక గదిలో ఏర్పాటు చేశారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక కొత్తగా ఏర్పాటు చేసిన వార్డు సచివాలయాలలో రెండింటిని ఇదే స్టేడియంలో ఏర్పాటు చేశారు. వాటి కోసం మాత్రం విద్యుత్ సదుపాయం కల్పించారు. మిగిలిన భవనాలు, గ్యాలరీ వగైరా శిథిలావస్థకు చేరాయి. ఈ పూర్వ రంగంలో స్టేడియాన్ని ఆధునీకరించి, పునరుద్ధరించాలని గత ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు తదితరులు జివిఎంసి అధికారులపై ఒత్తిడి తెచ్చారు. దీంతో జివిఎంసి ప్రస్తుత కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ స్పందించారు. స్వయంగా ఆయన సంబంధిత అధికారులతో కలిసి స్టేడియాన్ని కొద్ది మాసాల క్రితం పరిశీలించారు. దీనిని ఏ విధంగా పునరుద్ధరణ చేయాలనే అంశంపై అధికారులతో సంప్రదించి పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రూ.2 కోట్లతో ఆధునీకరణ పనులు చేపట్టారు. అందులో భాగంగా స్టేడియం చుట్టూ రోడ్డును పూర్తిస్థాయిలో తారు రోడ్డుగా మార్పు చేశారు. అలాగే శిథిలావస్థకు చేరిన గ్యాలరీని అవసరమైన చోట్ల పూర్తిగా తొలగించి కొత్తగా 'రెయిన్ బో గ్యాలరీ' నిర్మాణం చేపట్టారు. గ్యాలరీకి రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారు. స్కోర్ బోర్డు నిర్మించారు. కొత్తగా విద్యుత్ స్తంభాలను అవసరమైన చోట్ల ఏర్పాటు చేయడంతో పాటు ఆధునిక విద్యుత్ దీపాలను వేసే పనులు చేపట్టారు. మంచినీటి కోసం కొత్తగా బోర్లు తవ్వి వాటికి మోటార్లు అమర్చారు. పైపులైన్లు నిర్మాణం చేస్తున్నారు. స్టేడియం ఎదుట భాగంలో ఉన్న ఖాళీ ప్రదేశంలో ఒకటోట టెన్నిస్ కోర్టు, దానిని ఆనుకొని స్నూకర్, బాక్సింగ్ రింగ్, చుట్టూ ఇనుప ఫెన్సింగ్ నిర్మించారు. మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. ఇండోర్ గేమ్స్ ఏరియా, స్టేడియం చుట్టూ ఆహ్లాదం పంచే పూల మొక్కలను ఏర్పాటు చేస్తున్నారు. పిల్లల కోసం ప్లే ఏరియా, మహిళలు, యువకుల కోసం జిమ్ నిర్మిస్తున్నారు. కూర్చునేందుకు బల్లలు, కార్లు పార్కింగ్ చేసుకోవడానికి సరిపడే స్థలం అభివృద్ధి, ఇండోర్ గేమ్స్ ఏరియా అభివృద్ధి పనులు సాగుతున్నాయి. ఆధునికీకరణ నేపథ్యంలో స్టేడియంలో ఉండే స్పోర్ట్స్ కార్యాలయాన్ని, వార్డు సచివాలయాలను వేరే చోటుకు తరలించారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఈ స్టేడియాన్ని 1986లో నిర్మాణం చేపట్టి ఏడాది సమయంలో పూర్తి చేయగా 1987 డిసెంబర్ 12న అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టి.రామారావు ప్రారంభించి జాతికి అంకితం చేశారు. అప్పట్లో నగర మేయర్‌గా ప్రముఖ న్యాయవాది డివి.సుబ్బారావు ఉన్నారు. ఆ స్టేడియానికి ఇప్పుడు నూతన హంగులు రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రక్తదానంతో మేలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి రక్తదానం చెయ్యడం వల్ల మంచి సంతృప్తి లభిస్తుందని లయన్స్ బ్లడ్ బ్యాంక్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఎన్‌వివిఎస్.దుర్గాప్రసాద్ అన్నారు. స్మార్ట్ విశాఖ కెమిస్ట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం రాంనగర్ లయన్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ఆసుపత్రుల్లో నెలకొన్న రక్తకొరతను అధిగమించేందుకు యువత ముందుకు రావాలన్నారు. ఈ రక్తదాన శిబిరంలో లయన్స్ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ పివి.చంద్రశేఖర్, స్మార్ట్ సిటీ కెమిస్ట్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు బగ్గం శ్రీనివాస్, కార్యదర్శి బొనగిరి రమేష్, పాల్గొన్నారు. సొసైటీకి చెందిన 300 మంది యువకులు రక్తదానం చేశారు.

మాకు అన్యాయం చేస్తారా..?

బక్కన్నపాలెం, కొమ్మాది, రేవళ్లపాలెం రైతుల ఆందోళన



ఆందోళన చేపట్టిన రైతులు, సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి - పిఎం.పాలెం : ఇళ్ల కేటాయింపులో తమకు తీవ్ర అన్యాయం జరిగిందంటూ బక్కన్నపాలెం, కొమ్మాది, రేవళ్లపాలెంలకు చెందిన రైతులు ఆదివారం ఆందోళన చేపట్టారు. జిల్లా కలెక్టర్ దగ్గర నుంచి తహశీల్దార్, ఎపి హౌసింగ్ కార్పొరేషన్ పీడీ వరకూ భూమి కోల్పోయిన తమకు ఇళ్లు ఇచ్చిన తరువాతనే ఇతరులకు కేటాయిస్తామని హామీ ఇచ్చి నేడు మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. భూములు కోల్పోయిన రైతులకు ఇళ్లు ఇవ్వకుండా వేరే వాళ్లకు కేటాయించినట్లు తెలిపారు. జవహర్ నవోదయ విద్యాలయం వద్ద రైతుల నుండి ఎటువంటి నష్టపరిహారమూ ఇవ్వకుండా భూములు లాక్కున్నారని, సినిమా ఇండస్ట్రీ ఆర్థిక సాయంతో ఎన్‌టిఆర్ హుదూద్ ఇళ్లను నిర్మించారని గుర్తుచేశారు.

దశాబ్దాల కాలం నుంచీ తాము ఆ భూముల్లో ఉన్నామన్నారు. 2017లో హైకోర్టులో కేసు వేయగా భూములు కోల్పోయిన రైతులకు ఇళ్లు ఇవ్వాలని కోర్టు కూడా ఆదేశించిందన్నారు. అయితే న్యాయమైన రైతులకు ఇళ్లు కేటాయించకుండా ఇప్పుడు ఉత్తర నియోజకవర్గానికి చెందిన వారికి కేటాయించడం అన్యాయమన్నారు. రైతులకు మద్దతుగా ఆరో వార్డు టిడిపి నాయకులు పోతిన ఎల్లంనాయుడు, నాగోతి వెంకటరావు, బంక పోతురాజు, సిపిఎం నాయకులు డి.అప్పలరాజు, ఎస్.పైడితల్లి, ఎంఆర్‌పిఎస్ నాయకులు ఎం.రమణ తదితరులు నిలిచారు. కొంతసేపు రైతులకూ, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికీ వాగ్వాదం నెలకొంది. అనంతరం హౌసింగ్ కార్పొరేషన్ ఈఈ విజయలక్ష్మి ఘటనా స్థలానికి పిఎం.పాలెం పోలీసులతో చేరుకున్నారు. ఇళ్లు వేరే ప్రాంతానికి చెందిన 151 మందికి కేటాయించామని తెలియజేశారు. ఇంకా 150 ఇళ్లు ఉన్నాయని, తప్పకుండా ఇస్తామని హామీ ఇచ్చారు. దీనికి రైతులు ఒప్పుకోలేదు. తమకు న్యాయం జరిగేంత వరకూ కదిలేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. సమస్య పరిష్కారమయ్యేంత వరకూ ఇళ్లలోకి ఎవరినీ అనుమతించబోమని అధికారులు తెలియజేశారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలి



దీక్షల్లో కూర్చున్న బిహెచ్‌ఇఎల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ ముప్పు నుంచి తప్పించి ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని బిహెచ్‌ఇఎల్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి జిటిపి.ప్రకాష్ విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని కోరుతూ విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1166వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో బిహెచ్‌ఇఎల్ ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితంగా ప్రభుత్వ రంగంలో ఏర్పాటైన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రకటించినప్పటి నుంచీ దేశ వ్యాప్తంగా ఉద్యమాలు సాగుతున్నాయన్నారు. అయినప్పటికీ మోడీ సర్కారు వెనక్కు తగ్గకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వాలు ప్రజల ఆకాంక్షలను గుర్తెరిగి స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్.జగన్నాథరావు, సత్యనారాయణ, అప్పలనాయుడు, కె.నారపరెడ్డి, చైతన్య, జి.అచ్చంనాయుడు, పి.శివరాం, బి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వంశీకృష్ణకు అభినందనల వెల్లువ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ దక్షిణ నియోజకవర్గంలో భారీ మెజార్టీతో గెలుపొందిన ఎమ్మెల్యే, జనసేన జిల్లా అధ్యక్షులు వంశీకృష్ణ శ్రీనివాస్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. ఆదివారం ఉదయం శివాజీపాలెంలోని పార్టీ కార్యాలయానికి పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు, వివిధ సంఘాల నేతలు తరలివచ్చి పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. ఆర్‌టిసి మజ్దూర్ యూనియన్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకులు, కనకమహాలక్ష్మి దేవస్థానం ఇఒ, సత్యనారాయణ స్వామి దేవస్థానం ఇఒ, గ్రామ సంఘాల పెద్దలు, వార్డు కమిటీల నాయకులు వంశీకృష్ణను అభినందించిన వారిలో ఉన్నారు. జనసేన, తెలుగుదేశం, బిజెపిల నాయకులు వంశీని సత్కరించారు.

బీచ్‌లో బాలికను కాపాడిన లైఫ్‌గార్డులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ ఆర్‌కె బీచ్‌లో మునిగిపోతున్న బాలికను జివిఎంసి లైఫ్ గార్డులు రక్షించారు. వివరాల్లోకి వెళ్తే.. నగరంలోని రామ్‌నగర్‌కు చెందిన సుధ బీచ్‌లో ఆటవిడుపుగా స్నానానికి దిగి అలల తాకిడికి లోపలికి వెళ్లిపోసాగింది. గమనించిన జివిఎంసి లైఫ్‌గార్డులు ఆనంద్, వాసు, అచ్చన్నలు ఆమెను రక్షించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా వారిని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ ఓ ప్రకటనలో అభినందించారు. తీరానికి వచ్చే సందర్శకులు, విహార యాత్రికులు, నగర ప్రజలు సముద్రంలో ప్రమాదాలకు గురికాకూడదని జివిఎంసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ బీచ్‌లో స్నానానికి దిగి లోతట్టు ప్రాంతాలకు వెళ్లి పలువురు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. అప్రమత్తంగా ఉండటం ఎంతైనా అవసరమని పేర్కొన్నారు. పర్యాటకుల, నగర వాసుల భద్రతే తమకు ముఖ్యమన్నారు.

కొండప్ప చెరువు కాలుష్యంతో ఇబ్బందులు


దుర్వాసన వెదజల్లుతున్న కొండప్ప చెరువు ఇదే

ప్రజాశక్తి- తగరపువలస : జివిఎంసి రెండో వార్డు పరిధి సంగివలస, కొండప్ప చెరువు ద్వారా వెలువడుతున్న కాలుష్యం వల్ల అల్లూరి సీతారామరాజు కాలనీ వాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఏదో చల్లని, స్వచ్ఛమైన గాలిని ఆస్వాదిద్దామంటే దుర్వాసనతో కూడిన గాలి వస్తుండడంతో తినే ఆహారం కూడా వంటబట్టడం లేదని పలువురు మహిళలు వాపోతున్నారు. దుర్వాసన భరించలేక తమ పిల్లలు స్కూల్ లోనే ఉండిపోతే బాగుంటుందన్న అభిప్రాయాన్ని కొందరు తల్లిదండ్రులు వ్యక్తం చేస్తున్నారు. ఎండ తీవ్రంగా ఉంటే చెరువుకు చుట్టూరా తెట్టు చేరి దాని ద్వారా దుర్వాసన వస్తోందని స్థానిక మహిళలు చెబుతున్నారు. ఇక్కడ చెరువుకు ఆనుకుని దాదాపు 50 నుంచి 60 కుటుంబాలు నివసి స్తుండగా, వేగంగా వీచే గాలితో దుర్వాసన వ్యాపిస్తే ఆ ప్రభావం మరికొన్ని కుటుంబాలపై పడుతుందని స్థానికులు చెబుతున్నారు.

దుర్వాసనతో స్థానికుల అవస్థలు

చప్టా ఎత్తు పెంచడం వల్లనే...

గతంలో ఉన్న చప్టాను ఇటీవల దాదాపు అడుగున్నర ఎత్తు పెంచి నిర్మించడం వల్ల చెరువు నీరు పల్లపు ప్రాంతంలోకి వెళ్లడం లేదని స్థానికులు చెబుతున్నారు. చెరువులో నీరు నిల్వ ఉండడంతో అనివార్యంగా దుర్వాసన వస్తుందని స్థానికులు అంటున్నారు. అలానే హైవే విస్తరణ, చెరువు చుట్టూరా అధిక సంఖ్యలో అపార్ట్‌మెంట్లు నిర్మాణాలు జరిగాక ఆయా వారి వాడుక నీరు సైతం ఈ చెరువులోకి వస్తుండడం కూడా చెరువు కాలుష్యానికి మరో కారణంగా పలువురు అభిప్రాయ పడుతున్నారు.

దుర్వాసన వస్తుందని ఫిర్యాదులిస్తే బ్లీచింగ్ పౌడర్ చల్లి తాత్కాలిక చర్యలు చేపడుతున్నారు తప్పితే మురుగు నీరు శాశ్వతంగా బయటకు వెళ్లే చర్యలు చేపట్టడం లేదని జివిఎంసి అధికారుల తీరుపై స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు.

వృద్ధాలతో సమస్య

చెరువులో చేరుతున్న అనేక వ్యర్థాల వల్ల కాలుష్య సమస్య ఏర్పడుతుంది. జివిఎంసి అధికారులు స్పందించి దుర్వాసన రాకుండా చర్యలు తీసుకోవాలి


ఎ.గంగాభవాని
గృహిణి

భోజనం సహించడం లేదు

దుర్వాసనకు భోజనం కూడా సహించడం లేదు. చాలా ఇబ్బంది పడుతున్నాం. దుర్వాసన భరించలేక తమ పిల్లలు స్కూల్‌లోనే ఎక్కువ సమయం ఉండాలని అంటున్నారు. పిల్లలకు క్యారేజీ తీసుకెళ్ళి స్కూల్‌లోనే ఉండాలని అనిపిస్తుంది. నిల్వ ఉన్న మురుగు నీటిని శాశ్వతంగా బయటకు మళ్లించాలి.


కె.మాధవి
గృహిణి

దుర్వాసన తీవ్రం

ప్రస్తుతం ఉక్క పోత ఎక్కువగా ఉన్నందున చల్ల గాలి కోసం బయటకు వస్తే చెరువు నుంచి దుర్వాసన వస్తోంది. ముక్కు పుటాలు అదిరేలా వస్తున్న దుర్వాసనను భరించలేక పోతున్నాం.


బి.రాజేశ్వరి
గృహిణి

నేరాలు ఘోరాలు

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి -సీతమ్మధార : అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని నాలుగో పట్టణ పోలీసులకు అప్పగించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన లచ్చన్న, కాకినాడకు చెందిన గరికిన మేషన్ ఒడిశా నుంచి గంజాయి తీసుకొచ్చి నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని డిఎల్‌బి గ్రౌండ్ సమీపంలో సంచరిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని వానిపై ప్రశ్నించి, బ్యాగు తనిఖీ చేశారు. రెండు కిలోల గంజాయిని గుర్తించారు. వెంటనే ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకొని నాలుగో పట్టణ పోలీసులకు అప్పగించారు. దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


బహుమతులు అందుకున్న విద్యార్థులు

ఆదర్శ హిందీ ప్రేమీ మండలి వార్షికోత్సవం

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఆదర్శ హిందీ ప్రేమీ మండలి 30 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక ఆదర్శ హిందీ ప్రేమీ మండలి వ్యవస్థాపక అధ్యక్షులు కాళ్ల సూర్య రామకృష్ణారావు ఆధ్వర్యాన భీమిలిలో ఆదివారం ఘనంగా వేడుకలు జరిగాయి. విద్యార్థులకు తెలుగు, హిందీ మాధ్యమాల్లో వ్యాస రచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 48 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి గౌరవాధ్యక్షులు నూకరాజు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.


కొమ్మాదిలో బ్రాంచిని ప్రారంభిస్తున్న సీతామూర్తి

కొమ్మాదిలో సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ స్కూల్

ప్రజాశక్తి -పిఎం పాలెం : జివిఎంసి ఆరో వార్డు పరిధి కొమ్మాది విలేజ్ సమీపంలో సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ స్కూల్ ఐదో బ్రాంచి ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కూల్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ సీతామూర్తి మాట్లాడుతూ, విద్యార్థుల్లో వ్యక్తిత్వం ముందు, పోటీ ఆ తర్వాతే అన్న నినాదమే మమ్మల్ని ముందుకు తీసుకెళ్తుందని చెప్పారు. ఇంటర్నేషనల్ ప్రమాణాలతో కూడిన చదువు, ఏడు నుంచి పదో తరగతి వరకు సిబిఎస్‌సి కోర్సు అందిస్తున్నామని తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ ధనుంజయ్‌రావు మాట్లాడుతూ, సంస్థ 22 సంవత్సరాల నుంచి నడుస్తుందన్నారు. 22 మందితో ప్రారంభమైన సంస్థ నేడు పది వేల మంది విద్యార్థులతో దిగ్విజయంగా ముందుకు వెళుతుందని తెలిపారు. విద్యార్థుల కమ్యూనికేషన్ స్కిల్స్ బాగున్నాయని తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ స్కూల్స్ డైరెక్టర్లు శ్రీనివాసరావు, కార్తీక్ పాల్గొన్నారు.

త్వరలో పక్షవాత పునరావాస కేంద్రం

ప్రజాశక్తి- ఆనందపురం : ప్రముఖ న్యూరో వైద్యులు, విజయ హాస్పిటల్ అధినేత డాక్టర్ బి.సునీల్‌కుమార్ ఆధ్వర్యాన పిఎం.పాలెంలోని వైఎస్ఆర్ క్రికెట్ స్టేడియం ఎదురుగా పక్షవాత పునరావాస కేంద్రాన్ని త్వరలోనే ప్రారంభిస్తున్నారు. ఈ సందర్భంగా ఆనందపురం మండల గ్రామీణ వైద్యులకు వైద్య విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో డాక్టర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ, మెదడుకు సంబంధించిన వ్యాధులు ఎలా సంభవిస్తాయి, వాటిని ఎలా నిర్మూలించాలి, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో పక్షవాత పునరావాస కేంద్రం బ్రోచర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షులు జంగం జోషి, కారుణ్య కేన్సర్ ఫౌండేషన్ కార్యదర్శి కోన ప్రకాష్, జిల్లా కార్యదర్శి కెఎన్.రావు, గ్రామీణ వైద్యుల ఆనందపురం మండల అధ్యక్షులు పోతిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి నాగేశ్వరరావు, జోనల్ కోశాధికారి పచ్చిపులుసు కనకరావు, రామకోటేశ్వరరావు, ప్రచార కార్యదర్శి పడాల వినోద్, కాంచన, భవాని పాల్గొన్నారు.

నాకు సేవ మాత్రమే తెలుసు : దంతులూరి

ప్రజాశక్తి- పద్మనాభం : తనకు రాజకీయాలు తెలియవని, ప్రజలకు సేవ చేయడం మాత్రమే తెలుసునని మాజీ ఎంపిపి దంతులూరి గోపాలకృష్ణమూర్తిరాజు (గోపిబాబు) అన్నారు. మండలంలోని గంగవరం కొవ్వాడ పెంట అనంతవరం గ్రామాలకు చెందిన ఎంపిటిసి మాజీ సభ్యులు, మాజీ సర్పంచులు, వార్డు మెంబర్లు, ప్రస్తుత సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు ప్రజలతో ఆ గ్రామాలకు సమీపంలోని మామిడితోటలో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను వైసిపి నుంచి టిడిపిలోకి వెళ్లిన తర్వాత పార్టీలతో సంబంధం లేకుండా గోపిబాబే కావాలని తన వెంట వచ్చి ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి భారీ మెజార్టీ తీసుకొచ్చిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. తాత తండ్రుల నుంచి కాంగ్రెస్ పార్టీ వాదులమన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా పనిచేసిన కర్రి సీతారాం, వైసిపి ఎమ్మెల్యేగా పనిచేసిన ముత్తంశెట్టి శ్రీనివాసరావు తనను ఎన్నికల సమయంలో ఉపయోగించుకొని తర్వాత పట్టించుకోకుండా, తనపై కొన్ని అభియోగాలు వేస్తూ ఇబ్బందులకు గురిచేశారని తెలిపారు. అందుకే కొంత కాలం రాజకీయాలకు దూరంగా ఉన్నానని చెప్పారు. ఇప్పుడు మరలా మీ సేవలోఉంటానని, ఈ గ్రామాలు, మండల ప్రజలకు సేవ చేసుకునే భాగ్యం గంటా శ్రీనివాసరావు సారథ్యంలో తనకు కలిగిందని, అందరికీ సహకారంగా ఉంటానని తెలిపారు. స్వామినాయుడు, అప్పలనాయుడు, చంద్రరావు, వెంకట్రావు తదితర ఎంతోమంది నాయకులు సహకారంతో ఎన్నికల్లో కష్టపడి కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు విజయానికి సహకారం అందించామని చెప్పారు.

కూటమి నేతల విజయోత్సవాలు


కేకు కట్ చేస్తున్న సందీప్ తదితరులు

ప్రజాశక్తి -యంత్రాంగం

మధురవాడ : కూటమి గెలిచిన సందర్భంగా ఎండాడ, భీమిలి పార్టీ కార్యాలయంలో ఆదివారం విజయోత్సవం నిర్వహించారు. భీమిలి నియోజకవర్గం జనసేన ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్ మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రంలో జరిగిన ఎన్నికలలో పిఠాపురం నుంచి జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ అత్యధిక మెజారిటీతో విజయం సాధించటం, జనసేన పోటీచేసిన 21 స్థానాల్లోనూ విజయాన్ని నమోదుచేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. భీమిలి నుంచి గంటా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీగా శ్రీభరత్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకున్నందుకు, రాష్ట్రంలో అరాచక పాలనను అంతం చేసి కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. భీమిలి నియోజకవర్గం జనసేన బూత్ కన్వీనర్ శాఖరి శ్రీనివాస్ అధ్యక్షతన విజయోత్సవ కేక్ కటింగ్ చేశారు. కూటమి అభ్యర్థుల విజయంలో జనసేన నాయకులు కీలకపాత్ర పోషించారని, భవిష్యత్తులో అందరికీ తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ బి.వి.కృష్ణయ్య, నాయకులు శివ, సంతోష్ నాయుడు, నాగోతి నరసింహనాయుడు, దేవి, అనురాధ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు 8వ వార్డు పరిధిలోని పలు కాలనీల్లో జనసేన జెండాను ఆవిష్కరించారు.


అమనాంలో టిడిపి విజయోత్సవం

భీమునిపట్నం : మండలంలోని అమనాం గ్రామంలో ఆదివారం సాయంత్రం టిడిపి నాయకులు, కార్యకర్తలు విజయోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షులు దంతులూరి అప్పల నరసింహరాజు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ స్థానిక నాయకులు దంతులూరి నృసింహ సత్య నారాయణరాజు, పలువురు జన సేన నాయకులు పాల్గొన్నారు


విజయోత్సవంలో డిఎన్‌రాజు తదితరులు

పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి తమ్మిన రాజీనామా

ప్రజాశక్తి -భీమునిపట్నం : మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సిఫారసుతో గత వైసిపి ప్రభుత్వంచే నియమించబడిన ఎపి పద్మశాలి వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి ఆదివారం రాజీనామా చేసినట్లు తమ్మిన రామలక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2024 సాధారణ ఎన్నికల్లో వైసిపి ఓటమి చెందడంతో నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని ప్రస్తుత ఎపి స్పెషల్ చీఫ్ సెక్రటరీకి పంపినట్లు తెలిపారు. కులాల వారీగా బిసి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్లు ఏర్పాటు, అందుకు అనుగుణంగా నియమించిన ఛైర్మన్, డైరక్టర్లలో ఆత్మగౌరవం కల్పించినప్పటికీ నిధులు, విధులు కల్పించనందున ఆయా సామాజిక తరగతులకు తగిన న్యాయం చేయలేక పోయినట్లు వాపోయారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం మారినందున నైతిక బాధ్యతతో తన డైరెక్టర్ పదవికి రాజీనామా చేసినట్లు ప్రకటించారు.



అయ్యన్నపాత్రుడుతో టిడిపి లీగల్ సెల్ సభ్యులు

అయ్యన్నపాత్రుడును కలిసిన టిడిపి లీగల్ సెల్

ప్రజాశక్తి-లీగల్ : నర్సీపట్నం ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడును విశాఖ పార్లమెంటరీ టిడిపి లీగల్ సెల్ అధ్యక్షులు బత్తి రాజశేఖర్ ఆధ్వర్యాన సభ్యులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. జనసేన, బిజెపికి చెందిన లీగల్ సభ్యులు కూడా కలిశారు. అయ్యన్నపాత్రుడ్ని కలిసిన వారిలో ధర్మాలు దుర్గాప్రసాద్, దంత నరేష్ కుమార్, పళ్ళ బాలాజీరెడ్డి, కృష్ణమూర్తి, కొండ్రపు అచ్చంనాయుడు, వేణు, సుబ్రహ్మణ్యం, నారాయణ, శ్రీధర్, మహేష్ ఉన్నారు.



నిలిచిపోయిన ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణ పనులు

నిలిచిన పాఠశాల పనులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండల కేంద్ర చిన్నారులతో పాటు, ధోనిపుట్టు, దుర్గగూడ, వైయస్సార్ కాలనీ, ఇందిర కాలనీ చిన్నారులు సుజన కోట ప్రాథమిక పాఠశాల, దారపల్లి ప్రాథమిక పాఠశాలకు సుమారు 2 కిలోమీటర్ల దూరంలో వెళ్లి విద్యనభ్యాసిస్తున్నారు. ఈ నేపథ్యంలో గత మూడేళ్ల క్రితం మండల కేంద్రంలోని మినుముల పుట్టు గ్రామంలో ప్రాథమిక పాఠశాల మంజూరు చేశారు. ఆ భవనాన్ని ముంచింగిపుట్టు మండల కేంద్రంలో నిర్మించాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. నాడు నేడు నిధులు కేటాయించి పిల్లర్లు వేసి బేస్మెంట్లతో సరి పుచ్చారు. నాటి నుండి నేటి వరకు ఆయా గ్రామాల చిన్నారులు విద్య అభ్యాసానికై అనేక అవస్థలు పడుతున్నారు.

మండల కేంద్రంలోని ఎంపీడీవో, ఎంఈఓ కార్యాలయాలకు అతి సమీపంలో పాఠశాల భవనం నిర్మాణం పనులు అర్ధాంతంగా నిలిచిపోవడం విశేషం. దీంతో, రెండు కిలోమీటర్ల దూర ప్రాంతంలో వెళ్లి చదువుకునేందుకు చిన్నారులు శ్రద్ధ చూపలేదని, వర్షాకాలంలో తడుచుకుంటూ, నడుస్తూ పాఠశాలకు వెళతున్నారని చిన్నారుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు రోజుల్లో పాఠశాల పున: ప్రారంభం కానుండగా పనులు పూర్తి చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.ఇప్పటికైనా నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, ఐటిడిఏ పీవో, జిల్లా విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారి, ఎంపీడీవోలు ప్రత్యేక చొరవ తీసుకొని అర్ధాంతంగా నిలిచిన ప్రాథమిక పాఠశాల భవనం నిర్మాణాలు చేపట్టి ప్రాథమిక విద్యను చిన్నారులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో రాబోయే రోజుల్లో ర్యాలీలు, ధర్నాలు చేపడతామని మండల కేంద్రంలోని చిన్నారుల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

సీలేరులో భారీ వర్షం

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో ఆదివారం మధ్యాహ్నం భారీవర్షం కురిసింది. విద్యుత్ సౌకర్యానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆదివారం ఉదయం నుంచి సూర్యప్రతాపంతో ఎండతీవ్రతకు జనం అల్లాడిపోగా, మధ్యాహ్నం రెండు గంటలకు ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని, కారుమబ్బులు, ఉరుములు, మెరుపులతో కూడిన కుంభవృష్టి దాదాపు గంటపాటు కురిసింది. వర్ష ప్రభావంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతంలో ఇళ్లలోకి నీరుచేరకుండా ప్రజలు జాగ్రత్త వహించారు. వర్షం కారణంగా సుమారు గంటపాటు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. ఆదివారం వారపు సంతకు వచ్చిన వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు.. దూర ప్రాంతాల వారపుసంతకు నిత్యావసరాలు కొనేందుకు వచ్చిన వారంతా మధ్యాహ్నం వర్షం కురవడంతో వెళ్లేందుకు అవస్థలు పడ్డారు. రెండువారాలుగా ఉక్కపోతతో అల్లాడిన జనం, వర్షంతో ఉపశమనం పొందారు.

కళతప్పిన బంగారం షాపులు

వ్యాపారాలు సాగక బోసిపోయిన వైనం



జనాలు రాక వెలవెలబోతున్న బీసీ రోడ్డు బంగారు షాపులు

ప్రజాశక్తి -గాజువాక : 20 సంవత్సరాల క్రితం పరిస్థితి చూస్తే కొత్త గాజువాక బీసీ రోడ్ మార్కెట్ అంటే ప్రతి ఒక్కరికీ గుర్తొచ్చేది బీసీ రోడ్డు బంగారు షాపులే గుర్తొచ్చేది. అలాంటి బంగారు షాపులు నేడు వ్యాపారాలు సాగక వెలవెలబోతున్నాయి. ఒకనాటి కళ నేడు కనుమరగవుతోంది. దీనికి ప్రధాన కారణం పాత గాజువాక నుంచి కొత్త గాజువాక వరకు రెండు వైపులా వైభవ్, సిఎంఆర్, జిఆర్‌టి, ఖజానా తదితర పెద్దపెద్ద షాపులు ఏర్పాటయ్యాయి. పెద్ద పెద్ద షాపుల్లో ఆఫర్లతో బీసీ రోడ్డు బంగారు షాపులు వ్యాపారాలు పోటీపడలేకపోతున్నారు. వ్యాపారాలు సాగక చాలామంది అప్పులు పాలయ్యారు. ఒకప్పుడు బీసీ రోడ్లో 50 బంగారు షాపులు ఉండేవి. ప్రస్తుతం 15 షాపులకే పరిమితమయ్యాయి. నెల అంతా కష్టపడితే షాపు అద్దె, సిబ్బంది జీతాలు పోను షాప్ యజమానికి జీతం డబ్బులు మాత్రమే మిగులుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. దీంతో కొంతమంది ఈ వ్యాపారం వదిలి మెడికల్ ఫీల్డ్‌లోకి వెళ్లి పోవాలని భావిస్తున్నారు. గతంలో గాజువాకలోని ఏ ఇంట్లో వివాహం జరిగినా, ఏ కార్యక్రమమైనా బీసీ రోడ్డు వచ్చి బంగారం కొనుగోలు చేసేవారు. ఇప్పుడు వారంతా పెద్ద షాపులకు వెళ్తున్నారు.

గతంలో పాత గాజువాక వైపు నుంచి వచ్చే ప్రజలు బీసీ రోడ్డు వెళ్లాలంటే కొత్త గాజువాక దగ్గర ఆ రోడ్డులోకి తిరిగేవారు. ప్రస్తుతం బీసీ రోడ్డుకు వెళ్లే ఆ మార్గాన్ని ట్రాఫిక్ అధికారులు మూసివేశారు. పాత గాజువాక నుంచి వచ్చే ప్రజలు ఇప్పుడు మరింత ముందుకు వెళ్లి తిరిగి వెనక్కి వచ్చి బీసీ రోడ్డులోకి వెళ్లాల్సి ఉంది. దీంతో ఆ బంగారు షాపుల వైపు పరిమితంగానే వెళ్తున్నారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఎన్నికల హామీల్లో భాగంగా దీన్ని తొలగిస్తామని బంగారు షాపుల యజమానులకు హామీ ఇచ్చారు. ఆ హామీ నెరవేరిస్తే భవిష్యత్తులో వీరి వ్యాపారం ఎలా ఉంటుందో వేచి చూడాలి మరి.



గాజువాక నుంచి బీసీ రోడ్డులోకి వెళ్లే మార్గాన్ని మూసివేసిన దృశ్యం

నిర్వాసిత కాలనీ అభివృద్ధికి కృషి



బోర్లను ప్రారంభిస్తున్న పులి లక్ష్మీబాయి

ప్రజాశక్తి - గాజువాక : జివిఎంసి 75వ వార్డు పరిధిలో ఉన్న నిర్వాసిత కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి చెప్పారు. వార్డు పరిధి నెల్లిముక్కు, శీకువానిపాలెం, మొల్లివానిపాలెం, నీలాపు వీధి, దొమ్మేటి వీధులలో వేసిన బోర్లను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, శాసన సభ్యుల సహకారంతో ఆదర్శవంతమైన వార్డుగా తీర్చిదిద్దడానికి తన శక్తి మేరకు కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి, 75వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్ష కార్యదర్శులు నమ్మి అప్పారావు, దొమ్మేటి పెరుమాళ్ళ, జనసేన అధ్యక్షులు కోన చిన అప్పారావు, బిజెపి అధ్యక్షులు గోందేసి గురప్ప, కూటమి నాయకులు శ్రీమసిరి శ్రీనివాసరావు, ములకలపల్లి పెంటయ్య, నంబారు పైడయ్య, నంబారు సింహాద్రి, పులి శ్రీరామరెడ్డి, నీలాపు అప్పలరెడ్డి, బస అప్పలరెడ్డి, బొంగు రాజు, కిల్లాన ముసలయ్య పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సమ్మర్ టాలెంట్ షో

ప్రజాశక్తి-సీతమ్మధార : సాయినాథ్ కళా సమితి ఆధ్వర్యాన పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సమ్మర్ టాలెంట్ షో ఎంతగానో అలరించింది. సుమారు 40 మంది చిన్నారులు పాల్గొని క్లాసికల్, వెస్ట్రన్ డాన్సులతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కళ సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ అరుణ్ సాయికుమార్ మాట్లాడుతూ, 24 సంవత్సరాలుగా ఆర్ అండ్ బి వద్ద గల తమ సంస్థలో వెస్ట్రన్, క్లాసికల్, మ్యూజిక్, మెడిటేషన్‌లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏటాలాగే ఈసారి కూడా వేసవి సంగీత, నృత్య శిక్షణ శిబిరం నిర్వహించామని చెప్పారు. నెలరోజులపాటు నేర్చుకున్న అంశాలపై పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం విజేతలకు అతిథులు చేతుల మీదుగా బహుమతులు, ధ్రువీకరణ పత్రాలను, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డ్యాన్సర్ రాజు, నాట్యాచార్యుడు లలిత్ కుమార్ గుప్తా, చల్ల మంజుల, సూర్యకళ, తల్లిదండ్రులు, పిల్లలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సాయినాథ్ కళా సమితి వ్యవస్థాపకునితో పిల్లలు

అలరించిన సినీ సంగీత విభావరి

ప్రజాశక్తి-సీతమ్మధార : స్వరరాగం అండ్ మెలోడీ ఫ్యూజన్ ఆధ్వర్యాన పౌర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను ఎంతగానో అలరించింది. సంస్థ వ్యవస్థాపకులు ఎన్.రమేష్, ఎన్ఎన్.రావు ఆధ్వర్యాన పలువురు గాయనీగాయకులు పాత సినిమాల్లోని హిట్ పాటలను మధురంగా ఆలపించారు. సుమారు రెండు గంటల పాటు నిర్విరామంగా ఈ కార్యక్రమం సాగింది. అనంతరం అతిథులు చేతుల మీదుగా కళాకారులను సత్కరించారు.

ఎమ్మెల్యే పల్లాకు జ్వరం

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు జ్వరం కారణంగా ఆదివారం ఇంటికే పరిమితమయ్యారు. గాజువాక పార్టీ కార్యాలయానికి రాకపోవడంతో అభిమానులంతా ఆదివారం ఎదురు చూసి తిరిగి వెళ్ళిపోయారు. ఇటీవల కాలంలో ఎక్కువగా తిరుగుతున్న నేపథ్యంలో విశ్రాంతి లేక జ్వరం బారిన పడ్డారని పార్టీ నాయకులు తెలిపారు.

253 మందికి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి -రంపచోడవరం :రాజమండ్రి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక వైద్యశిబిరంలో 253మందికి వైద్య సేవలు అందించినట్లు మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయానందజీ మహరాజ్ తెలిపారు.మిషన్ మేనేజర్ స్వామి రఘువీరనంద మహరాజ్, ఆఫీస్ ఇంఛార్జి స్వామి వేదవిద్యానంద మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో .డాక్టర్ గోలి వెంకట రామారావు, డాక్టర్ కస్తూరి సుబ్రమణ్యం, డాక్టర్ పాతూరి శ్రీకృష్ణ, డాక్టర్ టివి.సుబ్బారావు, డాక్టర్.రాయుడు శ్రీనివాస్, డాక్టర్ ఎస్.సంపత్‌కుమార్, జిఎస్ఎల్ వైద్యులు పాల్గొని వైద్యసేవలు అందించారు 75మందికి వ్యాధినిర్ధారణకు రక్తపరీక్షలు, 11.మందికి థైరాయిడ్ పరీక్షలు 10మందికి ఇసిజిలు, 20మందికి ఎక్స్‌రేలు, తొమ్మిది మందికి ఫిజియోథెరపీ పరీక్షలు నిర్వహించారు.

వేమగిరి పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్యశిబిరంలో 65మందికి కంటి పరీక్షలు చేశారు 30మందికి కంటిఅద్దాలు, ఇతరులకు మందులు అందజేశారు. దృష్టిలోపం ఉన్న ముగ్గురిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేసి, వేమగిరి ఆసుపత్రికి తరలించారు. రామకృష్ణ పరమహంస నేత్రవైద్యశాల సంచార వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని స్వామీజీ కోరారు. వైద్య శిబిరంలో క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, వాలంటీర్స్ ఎల్‌బి.భగీరథ రాజు, ఉదయ్‌కిరణ్, మంగిరెడ్డి, వి.వెంకట సూర్యచంద్రం, వెంకటలక్ష్మిరాజు, జయకుమార్, ఆదిత్య, రామనరైన్, సిబ్బంది పాల్గొన్నారు. శిబిరానికి వచ్చిన రోగులు, వారి సహాయకులకు భోజన సదుపాయం కల్పించారు.

నాబ్ బాధితుల నిరసన ర్యాలీ

- 229వ రోజున దీక్షల్లో ఆందోళన తీవ్రతరం
- కొత్త ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని వేడుకోలు



ర్యాలీ చేస్తున్న నాబ్ నిర్వాసితులు, బాధితులు

ప్రజాశక్తి - అనకాపల్లి డెస్క్ : నాబ్ కోసం డిఆర్‌డిఒ నిర్మిస్తున్న ఏడు కిలోమీటర్ల ప్రహరీ నిర్మాణాన్ని నిరసిస్తూ పెద్దకలవలపల్లిలో నిర్వాసితులు, బాధితులు చేపడుతున్న ఆందోళన ఆదివారం నాటికి 229 రోజులకు చేరుకుంది. తమ ఆందోళనను పట్టించుకుని ప్రభుత్వం, అధికారుల తీరును నిరసిస్తూ ఆదివారం బాధితులు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తరాలుగా తమ గ్రామస్తులు సించలం, కోట కొండలపై గొర్రెలు, మేకలు, గేదెలు, ఆవులను మేపుకొని జీవనం సాగిస్తున్నామన్నారు. ఇపుడు గోడను అడ్డంగా కట్టేయడం వల్ల తమ జీవనోపాధి అయిన జీవాలు, పాడిపశువుల పెంపకానికి ఆధారం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎంపిటిసి రావి దేముళ్లు మాట్లాడుతూ, ప్రహరీ నిర్మాణం వల్ల ప్రజలకు జరుగుతున్న నష్టం, ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాల్సిన అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. నాబ్‌కు అవసరమైన భూసేకరణ సమయంలో ఇక్కడ గ్రామసభ, ప్రజాభిప్రాయ సేకరణ సమయంలో ప్రజలకు ముందుముందు వచ్చే ఎదురయ్యే ఇబ్బందులు, వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలను ఆలోచించకుండా, ఇపుడు గోడను నిర్మిస్తూ ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. కేంద్రం ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ ప్రాజెక్టుతో ప్రజలకు మేలు జరుగుతుందని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటామని భూసేకరణ సమయంలో హామీలిచ్చిన అధికారులు ఇపుడు తాము ఏడు నెలలకు పైగా ఆందోళన చేస్తున్నా తమకు పట్టనట్లు వ్యవహరించడ దుర్మార్గమన్నారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కొత్తగా కొలువుదీరనున్న ప్రభుత్వమైనా నాబ్ నిర్వాసితులు, బాధితుల కష్టాలను పరిష్కరించి, న్యాయం చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమములో గ్రామ పెద్దలు గుర్రం నూకినాయుడు, ఎలమంచిలి శ్రీను మరియు సుమారు 300 వందల మంది మహిళా రైతుకూలీలు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యాన చిత్రలేఖన పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో ఐద్వా నేత వరలక్ష్మి

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట పూసర్ల వీధిలో ఐద్వా ఆధ్వర్యంలో ఆదివారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి డి.వరలక్ష్మి మాట్లాడుతూ, పిల్లలు చదువుతోపాటు మానసికోల్లాసం, నైపుణ్యాభివృద్ధి పెంపొందించాలనే లక్ష్యంతో వారిలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నామన్నారు కార్యక్రమంలో ఐద్వా నేతలు తులసి, పిల్లలు రక్షిత రేవంత్, అనన్య, లోహిత్, దక్షిత్, స్నేహశ్రీ, రోషిత, లౌక్య, దీనశ్రీ, రిషిత పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు
తిమ్మరాజుపేట విద్యార్థుల ఎంపిక



ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి ఎంపికైన విద్యార్థులు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులు పాటిపల్లి ఆదర్శ పాఠశాలలో ఆరోతరగతిలో ప్రవేశానికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మారిశెట్టి వెంకట అప్పారావు తెలిపారు. పాఠశాలలో చదువుతున్న గుదే జ్యోతిక, అవర్ల అలమండ చరణ్, పప్పు భవిత ఆదర్శపాఠశాలలో ప్రవేశానికి అర్హత సాధించారన్నారు. విద్యార్థులు ఎంపిక పట్ల గ్రామ సర్పంచ్ ఎస్ భాగ్యలక్ష్మి, శివబాబు నాయుడు, స్కూల్ కమిటీ చైర్మన్ ఆడారి అనంతరావు, సహ ఉపాధ్యాయుని వై అరుణకుమారి తదితరులు అభినందనలు తెలిపారు. తమ పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు ఆదర్శ పాఠశాలకు ఎంపికయ్యేందుకు కృషి చేసిన ప్రధానోపాధ్యాయుడు మారిశెట్టి వెంకట అప్పారావును గ్రామస్తులు అభినందించారు.

కొల్లును కలిసిన బిసి సెల్ నేతలు



కొల్లు రవీంద్రను అభినందిస్తున్న భీమరశెట్టి

ప్రజాశక్తి-మునగపాక: టిడిపి బిసి సెల్ రాష్ట్ర నాయకుడు కొల్లు రవీంద్ర, ఎమ్మెల్సీ రామారావును వారి నివాసంలో మండలంలోని తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీమరశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బిసి నేతలు కలిసి అభినందనలు తెలిపారు. ఇటీవల ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ, టిడిపి పాలనలో బిసిలకు పెద్దపీట ఎపుడూ ఉంటుందని, వారి సమస్యలను పరిష్కరించి, అన్నివిధాలా అండగా ఉంటానని భరోసానిచ్చారు

200 'ఉపాధి' పనిదినాలు కల్పించాలి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న గనిశెట్టి

ప్రజాశక్తి -మునగపాక: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు 200 ఉపాధి పని దినాలు కల్పించి, రోజుకూలి రూ.600 ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఉపాధిహామీ పథకం కింద చెరువు పనులు చేస్తున్న ఉపాధి కూలీలను కలిశారు. రోజు వారీ వేతనం, సౌకర్యాల కల్పన, పని ప్రదేశంలో వారు పడుతున్న ఇబ్బందులు తదితర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ గతంలో ఉపాధి కూలీలకు పేస్లిప్పులు ఇచ్చేవారని, ఇప్పుడు ఇవ్వడం లేదన్నారు. మండుటెండలో పనిచేస్తున్న కూలీలకు టెంట్లు ఏర్పాటు చేసి మజ్జిగ, మంచినీరు వంటి సౌకర్యాలు కల్పించ లేదన్నారు. ఉపాధి కూలీలకు 30 శాతం వేసవి అలవెన్సు ఇచ్చి ఆదుకోవాలని, రెండు వారాలకు ఒకసారి చేసిన పనులకు కూలిడబ్బులు చెల్లించాలని, బకాయిపడ్డ ఉపాధి వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటాపురం ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం



విజేతలకు బహుమతులు అందిస్తున్న తులసీరావు

ప్రజాశక్తి-మునగపాక: స్థానిక శాఖగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు పెంటకోట తులసీరావు గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలుగా దినదిన ప్రవర్ధమానమై అభివృద్ధి చెందడం అభినందనీయమన్నారు. ఒకపుడు వృద్ధులు, పెద్దలు, మహిళలు వంటి వారే గ్రంథాలయాలను సందర్శించేవారని, ఇపుడు విద్యార్థులు, చిన్నపిల్లలతో గ్రంథాలయాలు పరిపుష్టిగా కనిపించడం సంతోషమన్నారు. గ్రంథాలయ అధికారి ఎల్‌వి.రమణ అధ్యక్షతన కార్యక్రమంలో సిఆర్‌పి బి.అచ్యుత కృష్ణ, పాఠకులు కరుణాకర్, బి గణేష్ పాల్గొన్నారు.

కష్టించి పనిచేసిన వారికి తగిన గుర్తింపు



సురేంద్రను సత్కరిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి : భావితరాల భవిష్యత్తు, రాష్ట్ర అభివృద్ధి కోసం, కచ్చితంగా ఆంధ్ర రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండాలని ప్రజలంతా అధికసంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొని, కసితో ఓటేసి కూటమి అభ్యర్థులను గెలిపించారనిచిన టిడిపి బిసి సాధికార సమితి రాష్ట్ర గవర కన్వీనర్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మళ్ల సురేంద్ర అన్నారు. పార్టీలో కష్టబడి పనిచేసిన ప్రతిఒక్కరికీ మంచి గుర్తింపు ఉంటుందని భరోసానిచ్చారు. కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర గవర కార్యవర్గ సభ్యులు సరగడం భాస్కర్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వచ్చి, సురేంద్రను కలిసి ఘనంగా సత్కరించారు రాష్ట్రంలో పార్టీ విపక్షంలో ఉన్నపుడు ప్రతి కార్యక్రమంలోనూ పాల్గొని, ప్రజల్ని చైతన్యవంతం చేసి కూటమి అభ్యర్థుల అఖండ విజయంలో మళ్ల సురంద్ర పాత్ర ఎంతో వుందని అభినందించారు. ఈ ఒసందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ, తాజా ఎన్నికల్లో దుష్టపాలనతో రాష్ట్రాన్ని అథోగతి పాల్జేసిన జగన్మోహనరెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దించాలన్న కసితో తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీల శ్రేణులతోపాటు ఉద్యోగస్తులు, కార్మికుల, మహిళలు, ఇలా అన్ని వర్గాల రాష్ట్ర ప్రజలందరూ అధిక శాతం ఓటింగ్‌లో పాల్గొని కూటమి విజయానికి కృషి చేశారన్నారు. చంద్రబాబు పాలనలో రాష్ట్ర అభివృద్ధితోపాటు, ప్రజలకు పూర్తి న్యాయం జరుగుతుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో దొడ్డి రాంబాబు, బేమర్శెట్టి వాసు, సూరిశెట్టి గోవింద్, కాండ్రేగుల వెంకటేశ్వరరావు, పీలా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజుకు అభినందన



ఎమ్మెల్యే రాజును అభినందిస్తున్న నేతవానిపాలెం గ్రామస్తులు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : చోడవరం ఎమ్మెల్యేగా విజయం సాధించిన కెఎస్ఎన్ఎస్ రాజును ఆదివారం చోడవరంలోని టిడిపి కార్యాలయంలో బుచ్చయ్యపేట శివారు నేతవానిపాలెం గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేగా విజయం సాధించిన రాజును అభినందించి, శుభాకాంక్షలు తెలిపారుఉ. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో కూటమి తరఫున టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా భారీ మెజారిటీతో విజయం సాధించడం హర్షనీయమని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పాలన సాగించాలని ఆకాంక్షించారు. వార్డు మెంబర్లు వియ్యపు రామారావు, బోడి రాము ఆధ్వర్యంలో 50 మంది టిడిపి కార్యకర్తలు వచ్చి ఎమ్మెల్యే రాజును దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ కార్యకర్తలు బర్నికాన నాయుడు, మడగల అవతారం పాల్గొన్నారు.

బ్రాండిక్స్ ఆధ్వర్యంలో
400 మందికి ఉచిత కంటి పరీక్షలు



కంటి శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న బ్రాండిక్స్ పార్టనర్ దొరైస్వామి

ప్రజాశక్తి -అచ్యుతాపురం : బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రాండిక్స్ కంపెనీ ఆవరణలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో 400 మందికి ఉచిత కంటి పరీక్షలు చేశారు. వివిధ దూర ప్రాంతాల నుంచి దాదాపు 450మంది కంటిరోగులు వైద్యశిబిరానికి తరలివచ్చారు వీరికి కంటిపరీక్షలు చేసిన నేత్ర వైద్య నిపుణులు, వారిలో 257 మందికి కంటి అద్దాలు అవసరమని నిర్ధారించగా, బ్రాండిక్స్ ఇండియా పార్టనర్ దొరస్వామి వారికి ఉచితంగా అందజేశారు. 110 మందికి రోగులకు మందులు పంపిణీ చేశారు. దృష్టిలోపం ఉన్న 40 మందికి క్యాటరాక్ట్ సర్జరీ చేయించుకోవాలని నేత్ర వైద్యులు సిఫార్సు చేశారు. కంటి వైద్యశిబిరానికి విచ్చేసిన రోగులకు, వారి సహాయకులకు మజ్జిగ, తాగునీరు, భోజనం సదుపాయాలను బ్రాండిక్స్ ఆధ్వర్యంలో కల్పించారు.

ఈ సందర్భంగా బ్రాండిక్స్ ఇండియా పార్ట్‌నర్ దొరస్వామి మాట్లాడుతూ, బ్రాండిక్స్ ఇండియా సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహించి, స్థానిక ప్రజల ఆరోగ్య సంరక్షణకు అండగా నిలవాలన్నదే లక్ష్యమన్నారు.

ఎమ్మెల్యే విజయకుమార్‌కు పలువురి అభినందన



ఎమ్మెల్యే సుందరపును అభినందిస్తున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : ఎలమంచిలి ఎమ్మెల్యేగా విజయం సాదించిన సుందరపు విజయ్ కుమార్‌ను డిఎస్‌పి పి శ్రీనివాసరావు ఆదివారం అచ్యుతా పురం ఎస్‌టిబిఎల్ లో సుందరపు స్వగృహంలో మర్యాద ్పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేగా విజయకుమార్ విజయం సాధించడంపై అభినందన లు తెలిపారు.
బ్రాండిక్స్ ఇండియా పార్టనర్ పి.దొరైస్వామి ఎలమంచిలి, భీమిలి ఎమ్మెల్యేలు సుందరపు విజయకుమార్, గంటా శ్రీనివాసరావులను వారి నివాసాల్లో వేర్వేరుగా కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. చౌడపల్లి గ్రామానికి చెందిన టిడిపి, జనసేన కార్యకర్తలు సుందరపు విజయ్‌కుమార్‌ను కలిసి ఎన్నికలలో విజయం సాధించడంపై హర్షం వెలిబుచ్చి, అభినందనలు తెలిపారు. ఎలమంచిలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావును ఎస్‌విజెడ్ కాలనీ టిడిపి, జనసేన నేతలు కార్యకర్తలు కలిసి ఎన్నికలలో విజయానికి కృషి చేసినందుకు అభినందించారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చి, ప్రజలకు న్యాయం చేస్తే
కొత్త ప్రభుత్వానికి పూర్తి సహకారం


- వైసిపి నేతలు, కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ



కార్యకర్తల సమావేశంలో ధర్మ శ్రీ

ప్రజాశక్తి- చోడవరం : కొత్తగా వచ్చిన ప్రభుత్వం ప్రజాపక్షాన నిలిచి ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ న్యాయం చేస్తే వారికి తమ పార్టీ తరపున పూర్తి సహకారం అందిస్తామని, లేనిఎడల ప్రజాక్షేత్రంలో ప్రజల కోసం పోరాటం చేస్తామనిమాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ స్పష్టం చేశారు. ఆదివారం చోడవరం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ, పార్టీ కేడర్ ఎవరూ అధైర్య పడవద్దని, వారి వెంటే తాను ఉంటానని భరోసానిచ్చారు. కొత్త ప్రభుత్వం మంచి చేస్తే సహకరిద్దామని, లేకపోతే పోరాటం చేద్దామన్నారు. సాధ్యం కాని హామీలను ఇచ్చి చంద్రబాబు తాజా ఎన్నికల్లో గెలిచాడని, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. పలువురు వైసిపి నేతలు, కార్యకర్తలు నాయకులు మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో ఉందని, అందరం సమిష్టిగా పనిచేద్దామని నిర్ణయించారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు. నమ్మినవారే పార్టీకి ద్రోహం చేశారంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో వైసిపి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సాయినాథ్ స్వర్ణోత్సవ వివాహవేడుక



50ఏళ్ల పెళ్లివేడుకలో సాయినాథరావు, మంగవేణి

ప్రజాశక్తి -సబ్బవరం : మండలంలోని ప్రముఖ పారిశ్రామికవేత్త సీనియర్ టిడిపి వాణిజ్య విభాగం కార్యదర్శి, యాదవ సంఘ జిల్లా అధ్యక్షుడు భర్నికాన సాయినాధరావు, మంగవేణి దంపతుల 50వ వివాహ వార్షికోత్సవ వేడుకలు గొట్టివాడలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ సంఘం జిల్లా, మండలశాఖల ఆధ్వర్యంలో సంఘ నేతలు సాయినాధరావు, మంగవేణి దంపతులకు ఘనంగా సన్మానించారు. నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘ నేతలు పల్లా తాతారావు, కోరాడ శ్రీనివాసరావు, ఈపు అప్పలరాజు, కోన సోమేశ్వరరావు, బంధం వెంకట రమణ, గవర అప్పారావు, గవర అప్పలనాయుడు, మామిడి శంకరరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ సభ్యులకు ఉచిత వైద్యపరీక్షలు



డాక్టర్‌ను సత్కరిస్తున్న వాకర్స్

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక గీతా హాస్పిటల్‌లో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఎముకలు, కీళ్ల వైద్యనిపుణులు డాక్టర్ వి. సంపత్ పాల్గొని60 మంది వాకర్స్ సభ్యులకు బిన్ మినరల్ డెన్సిటీ పరీక్షలు నిర్వహించి, వారికి తగు సూచనలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ సంపత్‌ను సీనియర్ వాకర్ నల్లాల దేవుళ్లు, డాక్టర్ ఎస్ నూకరాజు జ్ఞాపికతో సత్కరించారు.
ఈ సందర్భంగా డాక్టర్ సంపత్ మాట్లాడుతూ వాకర్స్ క్లబ్ ప్రతినిధులకు ఏటా ఈవిధంగానే వైద్యపరీక్షలు నిర్వహించి, వారికి ఆరోగ్యానికి భరోసా ఉంటానన్నారు.కార్యక్రమంలో వాకర్స్ అధ్యక్షులు భీశెట్టి రామకృష్ణ, కోశాధికారి రాపేటి నారాయణరావు, ఆడారి మల్లికార్జున రావు, సిహెచ్ నరసింగరావు, ఎంటి.రామారావు, టిఎస్ అప్పారావు, కాంద్రేగుల నూకరాజు, వై.సత్యనారాయణ, కెటివి. సత్యనారాయణ, డాక్టర్ వీరభద్రరావు, డి సూరిబాబు, బివి.రమణ, కెఎస్ఆర్ బాబ్జి, ఇతర వాకర్స్ పాల్గొన్నారు.

7న వరంగల్‌లో
మాదిగల ఆత్మగౌరవ కవాతు



మాట్లాడుతున్న ఎంఆర్‌పిఎస్ నేతలు

ప్రజాశక్తి- సబ్బవరం: వచ్చేనెల 7న వరంగల్‌లో మాదిగల ఆత్మగౌరవ కవాతును జయప్రదం చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అనకాపల్లి జిల్లా కార్య నిర్వాహక అధ్యక్షులు గొటివాడ సామ్రాట్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అతిత్వరలో మాదిగ ఉపకులాలన్నీ .30ఏళ్లపాటు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో మాదిగ ఉపకులాలు చేపట్టిన సుదీర్ఘ పోరాట ఫలాలను అందుకోబోతున్నామని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు దువ్వ దుర్గాలు, ఇండుగుబిల్లి గోపి, నీటిపల్లి ముత్యాలరావు, కొమ్ము కోటి, బొర్రా జయరాజు, మారెడుబుడి కోటి, ఇండుగుబిల్లి పరదేశి, ఈతలపాక పోలయ్య, నిమిడితల్లి చిన్నారావు, కోరుబిల్లి మారాజు, కణితి సింహాచలం పాల్గొన్నారు.

పంచాయతీలుగా దళితవాడలు



సునీల్ జన్మదిన వేడుకల్లో మిషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి -అనకాపల్లి : దళితవాడలను పంచాయతీలను చేయడమే లక్ష్యంగా అంబేద్కర్స్ ఇండియా మిషన్ పనిచేస్తుందన మిషన్ ప్రతినిధులు స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక దొడ్డి రామునాయుడు భవన్‌లో అంబేద్కర్ ఇండియా మిషన్ వ్యవస్థాపకులు, ఐపిఎస్ అధికారి పివి సునీల్ కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేకు కట్ చేశారు.
ఈ సందర్భంగా మిషన్ జిల్లా అధ్యక్షుడు చిన్నదేముడు మాట్లాడుతూ తమకు రాజకీయాలతో గానీ, పార్టీలతో గానీ ఎటువంటి సంబంధం లేదని, దళితుల అభివృద్ధే ధ్యేయమన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు భోగేష్, గొంది అప్పారావు, సాల్మన్ రాజు, తీటి నూకరాజు, మర రాజు, టీచర్స్ అసోసియేషన్ నుండి పల్లా బాబ్జి పాల్గొన్నారు.

లిఫ్ట్ అడిగిన వ్యక్తిపై దుండగుల దాడి

తీవ్రంగా గాయపరిచి.. నగదు, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు శ్రీను

ప్రజాశక్తి-దేవరాపల్లి : గమ్యానికి చేర్చుమన్న వ్యక్తిపై చాకుతో విచక్షణారహితంగా దాడి చేసి అతని వద్ద నగదును, సెల్‌ఫోన్‌ను గుర్తు తెలియని ఇద్దరు యువకులు దొంగిలించుకుపోయారు. దేవరాపల్లి సమీపంలోని వంతెన వద్ద ఆదివారం తెల్లవారిజామున 3 గంటల ప్రాంతంలో జరిగిన ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. గుర్తు తెలియని యువకుల చేతిలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడు ప్రస్తుతం కె.కోటపాడు సిహెచ్‌సిలో చికిత్స పొందుతున్నాడు.దీనికి సంబంధించిన వివరాలివి.

విజయనగరం జిల్లా ఎస్.కోట మండలం వెంకటరమణపేటకు చెందిన జవ్వాది శ్రీను (32) విశాఖ నుంచి దేవరాపల్లిలోని తన అత్తవారింటికి శనివారం రాత్రి బయలుదేరాడు. కొత్తవలస వరకు బస్సులోనూ, అక్కడ నుంచి వావిలపాడు. జంక్షన్ వరకు క్వారీ లారీ మీద చేరుకున్నాడు. అక్కడ నుంచి ఏ వాహనం దొరక్కపోవడంతో దేవరాపల్లికి నడుచుకుంటూ బయలుదేరాడు. మార్గమధ్యలో ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై దేవరాపల్లి వైపు వస్తుండగా వారిని ఆపి దేవరాపల్లి వరకు తీసుకెళ్లాలని కోరాడు. అతడిని ద్విచక్ర వాహనంపై ఎక్కించుకున్న యువకులు, దేవరాపల్లిలో దించకుండా ఊరుదాటిన తరువాత శారదానది వంతెన మీదకు నిర్మానుష్య ప్రదేశంలోకి తీసుకొచ్చి దించారు. అతని జేబులో ఉన్న పర్సు, సెల్ ఫోన్ ఇవ్వాలని బెదిరించాడు. పర్స్ ఇచ్చినా, సెల్‌ఫోన్ ఇవ్వడానికి నిరాకరించడంతో దీంతో రెచ్చిపోయిన యువకులిద్దరు అతనిపై చాకుతో దాడికి దిగారు. ఈ దాడిలో శ్రీను చేతి వేళ్ళు, తలతోపాటు శరీరంలోపలుచోట్ల విచక్షణా రహితంగా పలుచోట్ల తీవ్రగాయాలయ్యాయి. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో సెల్‌ఫోన్‌ను వారికిచ్చేసి ప్రాణభయంలో బాధితుడు పరుగులు తీశాడు. అయినా యువకులిద్దరు అతడిని వెంబడించడంతో, వంతెనకు దగ్గరలో ఉన్న ఇటుకబట్టీల వద్దకు చేరుకొని పెద్దగా కేకలు వెయ్యడంతో వారంతా నిద్రలేచి చూసేసరికి దాడికి పాల్పడిన యువకులిద్దరు పరారీ అయ్యారు. తీవ్రంగా గాయపడిన శ్రీనును దేవరాపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసంకె.కోటపాడు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎస్ఐ డి. నాగేంద్ర మాట్లాడుతూ చాకుతో దాడికి పాల్పడిన ఘటనపై కేసు నమోదు చేశామన్నారు. క్షతగాత్రుడు శ్రీను వద్ద నుంచి నగదు, సెల్‌ఫోన్‌ను దొంగిలించడానికే అతనిపై గుర్తుతెలియని వక్తులు చాకుతో దాడికి పాల్పడి ఉంటారని భావిస్తున్నామన్నారు. దాడి చేసిన వ్యక్తులపై ఆరా తీస్తున్నామన్నారు.

అనితకు మంత్రి పదవి దక్కేనా..?

- ఇప్పటివరకు .. పేటకు దక్కని అమాత్య పదవి

ప్రజాశక్తి-నక్కపల్లి:పాయకరావుపేట నియోజకవర్గం 1952 నుంచి ఏర్పడిన నాటి నుంచి 2019 వరకు 15 సార్లు ఎన్నికలు జరిగినప్పటికీ పేటకు మంత్రి పదవి దగ్గలేదు. అయితే ఈ సారి 2024 ఎన్నికల్లో టిడిపి ఎమ్మెల్యేగా అనిత భారీ మెజార్టీతో గెలిచారు. ఆమె పార్టీలో బలంగా ఉంటూ తనదైన శైలిలో వైసిపిపై విరుచుపడేవారు. ఈ సారి మంత్రి పదవి అనితకు దక్కే అవకాశం ఉందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు.



ఒకే అభ్యర్థిని పదేపదే గెలిపించినప్పటికీ పేటకు సరైన గౌరవం లభించలేదు.1952 లో ఆర్ఎస్ఎస్ రాజు (ఇండిపెండెంట్)గా బరిలోకి దిగి ఎస్ఏ నాయుడు (కాంగ్రెస్) అభ్యర్థిపై గెలుపొందారు.పాయకరావుపేట ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గంగా ఏర్పడిన తర్వాత 1962 లో మండే పిచ్చియ్య (సిపిఐ) నుంచి పోటీ చేసి యం పోతురాజు (కాంగ్రెస్) పై గెలుపొందారు. 1967,1972లో జి.సూర్యనారాయణ (కాంగ్రెస్) అభ్యర్థిగా పోటీ చేసి బి నాగభూషణం (ఇండిపెండెంట్) అభ్యర్థిపై విజయం సాధించారు. 1978లో మారుతి ఆదియ్య (కాంగ్రెస్- ఐ) అభ్యర్థిగా పోటీ చేసి జిసి నూకరాజు (కాంగ్రెస్) పై గెలుపొందారు. 1983లో గంటేల సుమన (టిడిపి) నుంచి పోటీ చేసి ఆర్ నీలపర్తి (కాంగ్రెస్) పై గెలుపొందారు.1985లో కాకర నూకరాజు (టిడిపి) అభ్యర్థిగా బరిలోకి దిగి జీవి హర్ష కుమార్ (కాంగ్రెస్) పై గెలుపొందారు.1989,1994 లలో కాకర నూకరాజు (టిడిపి) అభ్యర్థిగా బరిలోకి దిగి గంటేల సుమన (కాంగ్రెస్) అభ్యర్థిపై విజయకేతనం ఎగురవేశారు.1999 లో చెంగల వెంకట్రావు (టిడిపి) నుంచి బరిలోకి దిగి గంటేల సుమన (కాంగ్రెస్)పై గెలిచారు. 2004లో చెంగల వెంకట్రావు (టిడిపి) అభ్యర్థిగా పోటీ చేసి గంటేల సుమన (ఇండిపెండెంట్) పై గెలిచి విజయకేతనం ఎగురవేశారు. 2009లో గొల్ల బాబురావు (కాంగ్రెస్) అభ్యర్థిగా పోటీ చేసి చెంగల వెంకట్రావు(టిడిపి)పై గెలుపొందారు. 2012 ఉప ఎన్నికల్లో గొల్ల బాబురావు (వైసిపి) నుంచి బరిలోకి దిగి చెంగల వెంకటరావు (టిడిపి) పై విజయం సాధించారు. 2014లో వంగలపూడి అనిత (టిడిపి) అభ్యర్థిగా పోటీలో నిలిచి చెంగల వెంకట్రావు (వైసీపీ) అభ్యర్థిపై గెలుపొందారు. 2019లో గొల్ల బాబురావు (వైసిపి) అభ్యర్థిగా పోటీ చేసి బి.బంగారయ్య (టిడిపి)పై గెలుపొంది విజయం సాధించారు .

ఎప్పుడూ మొండి చెయ్యే..

పేట ఎస్సీ రిజర్వ్డ్ నియోజకవర్గంగా ఏర్పడిన నాటి నుంచి 2019 వరకు 14 సార్లు ఎన్నికలు జరిగాయి. 2 దఫాలు కాంగ్రెస్, 7 సార్లు టిడిపి, 2 సార్లు వైసిపి అభ్యర్థులు విజయం సాధించారు. ఎస్.రాయవరం మండలం, పెదగుమ్ములూరుకు చెందిన స్థానికుడు కాకర నూకరాజు 1985, 1989, 1994లలో జరిగిన ఎన్నికల్లో టిడిపి నుంచి పోటీ చేసి మూడు దఫాలు విజయ కేతనం ఎగురవేసి, హ్యాట్రిక్ కొట్టారు. అప్పట్లో కాకర నూకరాజుకు మంత్రి పదవి వరిస్తుందని ఆ పార్టీ శ్రేణులు ఎదురు చూసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. 2009లో కాంగ్రెస్ నుంచి 2012, 2019 లలో వైసీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన గొల్ల బాబురావు కు మంత్రి పదవి లభిస్తుందని ఎంతో ఆశతో ఎదురు చూసినప్పటికీ నిరాశే ఎదురైంది. జగన్ ప్రభుత్వంలో రెండు సంవత్సరాలన్నర చొప్పున జరిగిన మంత్రివర్గ విస్తరణలోనూ బాబురావుకు చోటు లేకుండా పోయింది. ఆయనకు మొండి చెయ్యి చూపించారు.

అనిత పై ఆశలు

2024 జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలుపొందిన తాజా ఎమ్మెల్యే వంగలపూడి అనితకు ఈ దఫా మంత్రి పదవి ఖాయమని నియోజకవర్గంలో జోరుగా ప్రచారం జరుగుతుంది. కూటమి ఎమ్మెల్యేగా గెలుపొందిన అనిత మంత్రి పదవి రేసులో ఉన్నట్లు సమాచారం. తాజాగా జరిగిన ఎన్నికల్లో ప్రత్యర్థి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులుపై 43,727 ఓట్ల మెజారిటీతో గెలుపొంది, ఇప్పటికీ ఉన్న రికార్డులు బద్దలు కొట్టి పేటను కైవశం చేసుకున్నారు. వంగలపూడి అనిత ఉపాధ్యాయురాలుగా పని చేస్తూ, రాజకీయాలపై ఉన్న మక్కువతో ఉపాధ్యాయ వృత్తికి రిజైన్ చేసి 2013లో టిడిపిలో చేరి రాజకీయ అరగేట్రం చేసారు. చంద్రబాబు నాయుడు అప్పట్లో ఆమెకు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించారు. 2014 లో ఆమె టిడిపి నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగి ప్రత్యర్థి చెంగల వెంకట్రావు (వైసిపి) అభ్యర్థిపై గెలుపొంది, మొదటిసారిగా ఆమె అసెంబ్లీలో అడుగుపెట్టారు. పార్టీలో అరగెట్రం చేసిన నాటి నుంచి నేటి వరకు పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తూ ఫైర్ బ్రాండ్ గా అనిత పేరు తెచ్చుకున్నారు. పార్టీ అధిష్టానం ఆమె ఇమేజ్ ను దృష్టిలో పెట్టుకుని పొలిట్ బ్యూరో సభ్యురాలు గానూ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగాను అనితకు పార్టీలో సుస్థిర స్థానం కల్పించారు. చంద్రబాబు మన్ననలతో విధేయురాలుగా ఉంటున్న వంగలపూడి అనిత తాజా ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో విజయడంకా మోగించడంతో ఆమెకు మంత్రి పదవి వరిస్తుందని పార్టీ క్యాడర్ ఎంతో నమ్మకంతో, ఆశతో ఎదురు చూస్తున్నారు. ఆమెకు మంత్రి పదవి వస్తే పాయకరావుపేట నియోజక వర్గంలో ప్రధాన సమస్యలు పరిష్కారం అవుతాయని పార్టీ శ్రేణులు భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో ఈనెల 12న కొత్త ప్రభుత్వం కొలువు దీరడంతో ఈసారైనా మంత్రి వర్గంలో పేటకు చోటు కల్పిస్తారో లేదో వేచి చూడాలి.

అయోమయంలో వాలంటీర్లు

- నూతన ప్రభుత్వం ఏం చేస్తుందోనని ఆందోళన

ప్రజాశక్తి-కోటవురట్ల:ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ఓటమి చవి చూడటంతో గ్రామ వాలంటీర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు విధుల నుంచి తాత్కాలికంగా తప్పుకోవాలని షరతు విధించడంతో ఇదే అదనుగా వైసిపి నాయకులు వాలంటీర్ల భవిష్యత్తుతో ఆటలాడుకున్నారు. వారిని గోతిలోకి నెట్టారు. వైసిపి నేతలు వాలంటీర్లను నియమించడంతో వారు చెప్పిందే తడువుగా రాజీనామాలు చేశారు.

వైసిపి ప్రభుత్వం ఏర్పడినప్పుడు సచివాలయ వ్యవస్థలో భాగంగా వాలంటీర్ల నియామకాలు చేపట్టి పథకాలను నేరుగా ప్రజలకు అందజేశారు. అయితే ప్రస్తుతం టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వాలంటీర్ల పరిస్థితి అయోమయంగా మారింది. మండల వ్యాప్తంగా 25 గ్రామపంచాయతీలకు గాను దాదాపు 350 మంది వరకు వాలంటీర్లను వైసిపి ప్రభుత్వం నియమించింది. వచ్చేది మరల వైసిపి ప్రభుత్వమే అని చెప్పి వాలంటీర్లు రాజీనామా చేసి ప్రచారం చేయాలని నాయకులు ఆదేశించారు. దీంతో దాదాపుగా 270మంది వాలంటీర్లు రాజీనామా చేశారు. ప్రస్తుతం టిడిపి అధికారంలోకి రావడంతో వారి భవిష్యత్తు అకమ్యగోచరంగా మారింది. నాయకులు మాట నమ్మి రాజీనామా చేశామని పలువురు వాలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా ప్రస్తుతం రాజీనామా చేయని వాలంటీర్లు సైతం భవిష్యత్‌పై మదనపడుతున్నారు. కూటమి ప్రభుత్వం వాలంటీర్లను నియమిస్తున్న తరుణంలో తమకు అవకాశం లభిస్తుందో లేదో అని వాలంటీర్లు లోలోన ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం తిరిగి తమకు అవకాశం కల్పిస్తుందని వారంతా ఆశగా ఎదురు చూస్తున్నారు. నూతన ప్రభుత్వం వాలంటీర్లకు డిగ్రీ అర్హత ప్రామాణికంగా తీసుకుంటున్నట్లు తెలుస్తుంది. ఒక్కొక్కరికి పది వేలు వేతనంతో పాటు గణనీయంగా వాలంటీర్లను తగ్గించే విధంగా ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. వాలంటీర్ల సేవలను మండల వ్యాప్తంగా వినియోగించుకునేందుకు ప్రభుత్వం విధి విధానాలు రూపొందిస్తున్నట్లు సమాచారం. అయితే ఎవరిని ఈ మేరకు నియమిస్తారనేది వేచి చూడాలి.



సమావేశానికి హాజరైన వాలంటీర్లు (ఫైల్‌ఫొటో)

విద్యుత్‌ను పునరుద్ధరించాలని నిరసన

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని దుర్గం పంచాయితీ దారగెడ్డ గ్రామంతో పాటు సగం గ్రామాలు గత ఐదు రోజుల నుండి విద్యుత్ లేక చీకటి లో మగ్గుతున్నాయి. విద్యుత్ శాఖ అధికారులకు ఎన్ని మార్లు పిర్యాదు చేసినా పట్టించు కోలేదని గ్రామస్తులు డిప్పల కేశవరావు, డిప్పల కొండబాబులు తెలిపారు. దారగెడ్డలో కాగడలు వెలిగించి నిరసన తెలిపారు. దారగెడ్డ పీవీటీజీ గ్రామంలో 100 ఇళ్ల తో 450 మంది జనాభా కలిగిన ఉన్నారన్నారు. తక్షణమే విద్యుత్ సౌకర్యం కల్పించాలని హుకుంపేట వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు అధికారులను కోరారు. దిగదారగెడ్డలో దూరంగా ఉన్న ఇళ్లకు విద్యుత్ స్థంభాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దార గెడ్డ వార్డ్ మెంబర్ గెమ్మేలి రమేష్, కేశవరావు, కొండబాబు, వంతల భీమన్న, వంతల కృప, కిల్లో దస్సు, డిప్పల రాజారావు, పాంగి దేముడమ్మ, కవిత, శ్రీదేవి, వంతల ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.



హెచ్ఎంతో పూర్వ విద్యార్థులు

హైస్కూల్‌కు పూర్వ విద్యార్థుల వితరణ

ప్రజాశక్తి - చీడికాడ:తాము చదువుతున్న స్కూల్ కి ఎంతో కొంత సహాయం అందించాలని పూర్వ విద్యార్థులు ముందుకు వస్తున్నారు. ఈ క్రమంలో 2009-10 సంవత్సరంలో తురువోలు జిల్లా పరిషత్ హైస్కూల్ లో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు తమ వంతు సహకారంగా పది వేల రూపాయలు విలువ గల మెటీరియల్‌ను స్కూలు ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణకి అందజేశారు. ప్రభుత్వ స్కూలులో విద్యార్థులను జాయిన్ చేస్తే భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణని పూర్వ విద్యార్థులు శాలువుతో ఘనంగా సత్కరించారు.

ఘనంగా ఘటాల ఊరేగింపు

ప్రజాశక్తి -చీడికాడ: మండల కేంద్రంలో మోద కొండమ్మ అమ్మవారి పండగ సందర్భంగా ఘటాలతో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొడ్డు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆ కుటుంబీకులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి గుడి వద్దకి చేరి పసుపు కుంకుమలు సమర్పించారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి కానుకలు సమర్పించారు. ఈ సందర్భంగా బొడ్డు శ్రీనివాస్ మాట్లాడుతూ, గ్రామంలో ప్రజలకు రానున్న పంట సీజన్లో అందరికీ మంచి జరగాలని పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ ఈ పండుగ జరుపుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబీకులతో పాటు గ్రామంలో భక్తులు పాల్గొన్నారు.



తరలి వచ్చిన భక్తులు

అస్తవ్యస్తంగా అన్నవరం రహదారి

- అవస్థలు పడుతున్న జనం

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలోని అన్నవరం గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా తయారవడంతో గ్రామస్తులు, ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. జగన్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో అధికార పార్టీ నాయకులే ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. ప్రస్తుతం ఈ రహదారిపై వెళ్లేందుకు వాహనదారులు సహా పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు వేములపూడి, నాతవరం మండలాలకు వెళ్లే దగ్గర దారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. విద్యా కేంద్రమైన నర్సీపట్నం పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సహా రాత్రి సమయంలో నడిచి వెళ్లేందుకు సైతం అవకాశం లేకుండా రహదారి పూర్తిగా చిత్రమైంది. పలుమార్లు ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. స్థానిక నాయకులు గోతుల్లో మట్టివేసి కప్పుకుని నడిచే పరిస్థితి నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో రోడ్డు సగభాగం కోతకు గురైంది. నూతన ప్రభుత్వం కొలువు తీరనున్న తరుణంలో రహదారి నిర్మాణం ఇప్పటికైనా చేపడతారని గ్రామస్తులు ఆశగా ఎదురు చూస్తున్నారు.



గోతులుగా ఉన్న రోడ్డు


అభినందనలు తెలుపుతున్న వెంకటేష్

టిడిపి నేతలకు అభినందనలు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేట టిడిపి నేతలను తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ అభినందనలు తెలిపారు. పాయకరావుపేట నియోజవర్గంలో నక్కపల్లి మండలం రాజయ్యపేట లో అనితకు 1894 ఓట్లు భారీ మెజారిటీ సాధించడంలో రాజయ్యపేట మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా పార్టీ గెలుపునకు కష్టించి పనిచేసిన గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యులు పిక్కి సత్తియ్య, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు, తదితర నాయకులకు అభినందనలు తెలిపి ,సన్మానించారు. అనంతరం రాజయ్యపేట నాయకులంతా కలిసి వెంకటేష్ కు శాలువా కప్పి సత్కరించారు.

టిడిపి నేతల విజయోత్సవాలు

గొలుగొండ:నర్సీపట్నం ఎమ్మెల్యేగా టీడీపీ తరపున పోటీ చేసిన చింతకాయల అయ్యన్నపాత్రుడు గెలుపొందడంపై మండలంలోని జీ.కొత్తూరు గ్రామంలో టీడీపీ శ్రేణులు ఆదివారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ, ఊరేగింపు చేపట్టారు. ఈ కార్యక్రమానికి అయ్యన్న సతీమణి చింతకాయల పద్మావతి హాజరై గ్రామంలోని మరిడమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎస్ఎఫ్ఐ పోరాటంతో

డిగ్రీ కాలేజీలో పీజీ కోర్సులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఎస్ఎఫ్ఐ పోరాటంతోనే నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీజీ కోర్సులు అందుబాటులోకి వచ్చాయని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జీ.గీతాకృష్ణ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పలుమార్లు కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కలెక్టర్‌లకు వినతులు అందించామన్నారు. ప్రస్తుతం పీజీలో ఎంఎస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ) 40 సీట్లు, ఎంఎస్సీ (కంప్యూటర్ సైన్స్) 20 సీట్లు, ఎంకామ్ (కామర్స్) 40 సీట్లు కోర్సులు అందుబాటులో రావడం హర్షణీయ మన్నారు. డిగ్రీలు పూర్తయిన కెమిస్ట్రీ, కంప్యూటర్స్, కామర్స్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఇక్కడ కొత్త కోర్సులు అందుబాటులో రావడం వల్ల సీట్లు పెరిగాయన్నారు. ఇందుకు కృషి చేసిన ప్రిన్సిపాల్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.


గెలుపొందిన పెద్దవలస జట్టు

క్రికెట్ టోర్నీ విజేత పెద్దవలస జట్టు

ప్రజాశక్తి - అరకులోయ రూరల్ : విజయనగరం జిల్లా చిట్టి పురం గ్రామంలో జరిగిన సిపిఎల్ క్రికెట్ టోర్నమెంట్‌లో అల్లూరి జిల్లా అరకులోయ మండలం లోతేరు పంచాయతీ పెద్దవలస టీం ఫైనల్‌లో ఘన విజయం సాధించి విజేతగా నిలిచింది. సుమారు వారం రోజులుగా జరిగిన ఈ టోర్నమెంట్లో 32 జట్లు పాల్గొని తమతమ ఆటను కనబర్చారు. ఆదివారం లోతేరు పంచాయితి పెదవలస, గన్నెల పంచాయితి పూజరిబంధ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ ఆడాయి. విజేతగా పెదవలన జట్టు గెలుచుకుంది. ఈ మ్యాచ్ లో జర్ర తిలక్ వర్మ 18 బంతుల్లో 56 రన్స్ సాధించగా, తాంగుల కుమార్ 22 బంతుల్లో 45 రన్స్ సాధించి జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించారు.

వైభవంగా మోదకొండమ్మ ఉత్సవాలు

-ఘనంగా ఉత్సవ విగ్రహం, పాదాలు, ఘటాల ఊరేగింపు
-ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు
-వేలాదిగా తరలి వచ్చిన భక్తులు


ఆకట్టుకున్న గరగల నృత్యం

ప్రజాశక్తి-పాడేరు:అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో ఆదివారం ఉదయం మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించనున్న అమ్మవారి జాతరలో భాగంగా ఆదివారం జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత, ఐటిడిఏ పిఒ వి.అభిషేక్, ఆలయ కమిటి అధ్యక్షురాలు కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి, పాడేరు శాసన సభ్యులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు అమ్మవారి ఆలయం నుండి శతకం పట్టు వరకు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని, పాదాలను ఘటాలను శతకం పట్టుకు డప్పు వాయిద్యాలు, గిరిజన నృత్యాలు, గరగల డాన్సులతో ఊరేగించారు. శతకం పట్టు వద్ద ప్రతిష్టించారు. భక్తులు అధిక సంఖ్యలో బారులు తీరి ఆలయం వద్ద సతకం పట్టు వద్ద కొలువు తీరిన అమ్మవారిని దర్శించుకున్నారు. కొలువు ఉత్సవంలో భారీ ఎత్తున మహిళలు, భక్తులు పాల్గొన్నారు. ఘటాల ఊరేగింపు కన్నుల పండవగా సాగింది. శతకంపట్టు వద్ద జిల్లా కలెక్టర్, ఐటిడిఏ పిఒ, సబ్ కలెక్టర్ బాణా సంచాలు కాల్చారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత విలేఖరులతో మాట్లాడుతూ, ఈనెల 9,10,11 తేదీలలో మూడు రోజుల పాటు జాతర నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామన్నారు. గిరిజన ఆరాధ్యదైవం దర్శనానికి వివిద ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తున్నారని తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసారని చెప్పారు. పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ధీరజ్, పాడేరు మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరి, ఆలయ కమిటీ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో ఆదివారం ప్రారంభమైన మోదకొండమ్మ అమ్మవారి ఉత్సవాలలో భాగంగా సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు పలువురిని విశేషంగా ఆకట్టుకున్నాయి... ఆదివారం సాయంత్రం శతకం పట్టు నుంచి పురవీధుల్లో అమ్మవారి ఘటాలను ఊరేగించారు ఈ సందర్భంగా పలు నృత్య ప్రదర్శనలు నిర్వహించారు.. చిత్ర విచిత్రమైన నృత్య ప్రదర్శనలతోనూ డప్పు వాయిద్యాలతో అమ్మవారి సంబరం ఘనంగా జరిగింది. కేరళ తరహా బ్యాండ్ మేళాలు డప్పుల డాన్సులతోపాటు అమ్మవార్ల వేషాలలో నృత్య ప్రదర్శన, అమ్మవారికి ప్రీతి పాత్రమైన గరగల నృత్యాలు పురవీధుల్లో ప్రదర్శించారు. జూనియర్ కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన జైంట్ వీల్స్ పలు యంత్ర ప్రదర్శనలు గ్లోబ్‌లో మోటార్ సైకిల్ కార్ల రేసింగ్ అబ్బుర పరిచాయి.

జాతరలో వైద్య శిబిరం ఏర్పాటు


కేరళ కళాకారుల ప్రదర్శన


ఘటాలను ఊరేగిస్తున్న కలెక్టర్, పిఒ

పాడేరులో మోదకొండమ్మ జాతర మహోత్సవాలను పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆదివారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని జాతర ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. వైద్య శిబిరానికి హాజరైన 219 మంది రోగులకు దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డీకే హిమబిందు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ, జాతరలో ప్రజలు ప్రత్యేక ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె తెలిపారు. జాతరలో విక్రయించే నిలువ ఆహారాన్ని, నిలవ పానీయాలను స్వీకరించరాదని ఆమె తెలిపారు. దీంతో ఉదర సంబంధమైన రోగాలు వ్యాప్తి చెందుతాయని ు తెలిపారు. ప్రస్తుతం ఎపెడమిక్ సీజన్ కావడంతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని వ్యాధుల భారిన పడకుండా ఉండాలన్నారు. జ్వరాలు వస్తే వెంటనే సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు వెళ్లి మెరుగైన చికిత్స పొందాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని ఆమె తెలిపారు. జాతరలో నిర్వహించే ప్రత్యేక వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

పల్లెల్లో కోతుల స్వైర విహారం


పల్లెల్లో తిరిగాడుతున్న కోతులు

ప్రజాశక్తి-గొలుగొండ:వానర మూకలు మండలంలోని పలు గ్రామాల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. కనిపించిన వారిపై దాడి చేయడం, పిల్లల చేతుల్లో ఉండే వస్తువులను ఉడాయించుకోవడం వంటివి చేస్తున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హడలిపోతున్నారు. ఒంటరిగా వెళ్లే వారిపై మూకలు దాడులకు తెగ బడుతున్నాయి.
మండలంలో జోగంపేట, ఏఎల్.పురం గ్రామంలో ఇళ్లల్లోకి వస్తూ ఏమి చేతికి దొరికితే వాటిని ఎత్తుకు పోతున్నాయి. దీంతో, చిన్న పిల్లల్ని, వృద్ధులు భయభ్రాంతులకు గురవుతున్నారు. పాతకేడిపేట, పాతమల్లంపేట పంచాయతీ శివారులో కూరగాయల ఫలసాయాన్ని కూడా



పాడు చేస్తున్నాయని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. కొత్త ఎల్లవరం పరిసరాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.

యువకులు రక్తదానం చేయాలి

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులో రాష్ట్రస్థాయిలో నిర్వహించబడుతున్న మోదకొండమ్మ ఉత్సవాలకు తరలి వచ్చే భక్తులుచ సందర్శకులుచ యువకులుచ ఉత్సాహవంతులు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న మెగా రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి కోరారు. ఆదివారం ఈ రక్తదాన శిబిరం ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఏజెన్సీలో రక్తపు నిలువలు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రాణాన్ని వారి కాపాడేందుకు దాతలు రక్తదానం చేసి ప్రాణదాన దాతలు కావాలని కోరారు. ప్రాణాపాయంలో ఉన్న రోగులకు, బాధితులకు మీరిచ్చిన రక్తం వారి జీవితానికి అండగా నిలిచి ప్రాణదాతలు అవుతారని సూచించారు. అపోహలు వీడనాడి అనుమానాలు పడకుండా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు.
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా మాట్లాడుతూ, యువకులు ఉత్సాహవంతులు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ప్రాణాపాయంలో ఉన్న రోగులకు, గర్భిణులకు రక్త నిలువలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని అన్ని శాఖల అధికారులు సహకరించి రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి ప్రాణదాతలు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రూప, రెడ్ క్రాస్ సొసైటీ పాడేరు కమిటీ సభ్యులు జయలక్ష్మి, సూర్యారావు కోఆర్డినేటర్ లోహితస్ సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్